క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌కు డీఎస్ఏ క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జీఎంసీ బాలయోగి స్టేడియం, ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన అండర్–17 బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపికల్లో కాకినాడ డీఎస్ఏ క్రీడాకారులు ప్రతిభను కనబర్చారని బ్యాడ్మింటన్ కోచ్ సత్తి చిన్నారి ఆదివారం ఇక్కడ తెలిపారు. శనివారం జరిగిన ఈ ఎంపికల్లో వై.రేణుక దేవి ప్రథమ, జి.కవిత ద్వితీయ, పి.లక్ష్మీ హర్షిత ఐదో స్థానం పొందారని వివరించారు. వీరు ఈ నెల 28న కోనసీమ జిల్లా మలికిపురంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్ సత్తి చిన్నారిని ఆదివారం డీఎస్ఏలో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాసకుమార్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించి, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కరప: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కూటమి నాయకులు, అధికారులతో కలిసి మండలంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. కొరిపల్లి, జెడ్.భావారం, గొర్రిపాలెం, వలసపాకల, వేములవాడ గ్రామాల్లో పర్యటించి, రూ.93 లక్షల విలువైన ఏడు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ, గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించి, ఇంటింటికీ రక్షిత మంచి నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీటీసీ పెద్దింశెట్టి సుజాత, ఎంపీడీఓ ఎం.అనుపమ, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సర్పంచ్ హామీ



మారుతీనగర్ వాసులతో సమావేశమైన సర్పంచ్ సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పరిధిలోని మారుతీనగర్‌లో వర్షపు నీరు పోయే మార్గం ఏర్పాటుతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలన్న కాలనీవాసుల కోరిక మేరకు వాటి పరిష్కారానికి సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ హామీ ఇచ్చారు. మారుతీనగర్‌లో సమస్యలను తెలియజేసేందుకు ఆదివారం సాయంత్రం కాలనీ అసోసియేషన్‌తో సర్పంచ్ సమావేశం నిర్వహించారు. కాలనీలోని సమస్యలను కాలనీ పెద్దలు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, సత్య ప్రసాద్, చాముండేశ్వరరావు, వంశీ తదితరులు సర్పంచ్ సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం మురుగు నీరు పోయేందుకు తూరలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తామని తెలియజేయడంతో వారందరూ సంతృప్తి వ్యక్తం చేశారు.

రోటరీ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవ



ట్రస్టీ భరత్ పాండ్యను సత్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: వ్యక్తి చేయలేని ఎన్నో పనులను రోటరీ ఫౌండేషన్ ద్వారా చేయవచ్చని, బాహ్య ప్రపంచం చూసేందుకు ఇది వేదికని ఫౌండేషన్ ట్రస్టీ భరత్ పాండ్య అన్నారు. ఆదివారం సూర్యకళా మందిరంలో రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో విశ్వాసం పేరిట ది రోటరీ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ సెమినార్ జరిగింది. కార్యక్రమానికి రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ పోలిశెట్టి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ ట్రస్టీ భరత్ పాండ్య , రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోటరీ ఫౌండేషన్ ద్వారా సమాజానికి ఉపయోగకరమైన ఎన్నో పనులు చేయవచ్చన్నారు. ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఫౌండేషన్ ట్రస్టీ భరత్ పాండ్యను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ తాడాల బుజ్జి, పాస్ట్ గవర్నర్ భాస్కర్‌రామ్, దత్తా సుబ్బారావు, ఆంజనేయమూర్తి, డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, వీరభద్రారెడ్డి, కాన్ఫరెన్స్ కమిటీ చైర్మన్ చోడవరపు మూర్తి, రోటరీ డిస్ట్రిక్ట్ సభ్యులు పాల్గొన్నారు.



కచేరిపేటలోని ఓ వీధిలో డ్రైనేజీపై ఆక్రమణ



కచేరిపేటలో రోడ్డుపై చేరిన డ్రైనేజీ మురుగు

సమస్యల కచేరి

- అధ్వానంగా మురుగునీటి వ్యవస్థ
- నిత్యం దుర్వాసన మధ్యే జన జీవనం
- దోమలతో ప్రజలకు నిద్ర కరవు
- పట్టించుకోని అధికారులు

బోట్‌క్లబ్: పెన్షన్ ప్యారడైజ్‌గా పేరొందిన కాకినాడ నగరంలో ప్రస్తుతం జీవన విధానం చాలా అధ్వానంగా తయారైంది. ఏ వీధిలో చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తోంది. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. దీంతో నిత్యం కంపు కొడుతున్నా ప్రజలు అక్కడే జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు నెలలు కావస్తున్నా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. కాకినాడ నగరపాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో, పలు ప్రాంతాలలో డ్రైనేజీలు చాలా అధ్వానంగా తయారయ్యాయి. పాలకవర్గం ఉంటే కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళితే, వెంటనే వాటికి పరిష్కారం లభించేది. కాకినాడ నగరపాలక సంస్థ పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రస్తుతం పారిశుధ్య సిబ్బంది తమ విధులకు సక్రమంగా హాజరు కాకుండా, తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా కచేరిపేట

కలెక్టరేట్ ఎదురుగా ఉన్న వీధి కచేరిపేటలో ప్రస్తుతం డ్రైనేజీలు రహదారులు చాలా అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు గత రెండు నెలలుగా తీయకపోవడంతో మురుగునీరు బయటకు పోయే అవకాశం లేకుండాపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు సైతం మురుగునీరు పోయేందుకు వీలు లేక, రహదారుల పైనే వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది . దీంతో ఈ మురుగు నీటిలోనే ఈ ప్రాంత ప్రజలు నిత్యం ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షం లేకపోయినా, ఇంట్లోని మురుగునీరు డ్రైనేజీల్లో నుండి రోడ్లపైకి వస్తోంది. అయినప్పటికీ సిబ్బంది ఈ వీధుల వైపు చూడడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు దోమలతో నిత్య అవస్థలు పడుతున్నారు చీకటి పడితే గుంపులుగా దోమలు ఇళ్లల్లో చేరుతున్నాయని, దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఈ ప్రాంత మహిళలు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫోన్లో ఈ ప్రాంత సమస్యలు విన్నవించుకున్నా, వారు పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కచేరిపేటలోని **ఒక వీధిలో డ్రైనేజీ ఆక్రమించుకుని ఓ వ్యక్తి నిర్మాణం సాగిస్తున్నా.. కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల కారణంగా డ్రైనేజీలో మురుగునీరు ప్రవహించడం లేదు.**

నివారణ చర్యలేవీ?

గతంలో దోమలు విజృంభించకుండా కార్పొరేషన్ అధికారులు యంత్రాల ద్వారా కనీసం వారంలో ఒక్కరోజైనా డ్రైనేజీల వద్ద ఫాగింగ్ చేసేవారు. రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేయడం వల్ల దోమలు అదుపులో ఉండేవి. దీంతో హాయిగా నిద్రపోయేవాళ్లమని. ప్రస్తుతం ఫాగింగ్ యంత్రాలను కనీసం వీధుల్లో కూడా తేవడం లేదంటున్నారు. అసలు ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయో, లేదో తెలియడం లేదని స్థానికులు మండి పడుతున్నారు.

కొరవడిన అజమాయిషీ

కాకినాడ నగరంలో సుమారు వెయ్యి మందికిపైగా రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. ప్రతి రోజు ఈ సిబ్బంది నగరంలో వారికి కేటాయించిన వీధుల్లో రోడ్లు శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, సిల్ట్ తీయాల్సి ఉంది. కార్పొరేషన్ పాలకవర్గం ఉంటే ఆ డివిజన్ కార్పొరేటర్ ప్రతి రోజు సిబ్బంది ఎలా పనిచేస్తున్నారో తనిఖీ చేసేవారు. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో సిబ్బంది తూతూమంత్రంగానే విధులకు హాజరవుతున్నారే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది సక్రమంగా విధులు రాకుండా, మస్టర్లు వేసుకుంటున్నారనే చర్చలు సాగుతున్నాయి. కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు విధులకు హాజరయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు



డ్రైనేజీలు నుంచి వస్తున్న దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత రెండు నెలలుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీలు శుభ్రం చేయలేదు. దీంతో కంపు కొడుతున్నా, ముక్కు మూసుకొని ఈ రహదారులపై ప్రయాణించాల్సి వస్తోంది.

– కె వీరబాబు, స్థానికుడు

దోమలు నియంత్రించాలి



మా కచేరిపేటలో రాత్రి సమయంలో దోమలు చాలా ఇబ్బంది పెడుతున్నాయి. ఏదో ఒక పనిమీద తలుపులు తెరిస్తే చాలు దోమలు ,గుంపులుగా లోపలకు వస్తున్నాయి. దోమల నిర్మూలనకు ఆల్‌అవుట్ వినియోగిస్తున్నా పెద్ద ఉపయోగం లేదు. దోమలు వ్యాప్తి చెందకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వి.శ్రీరామ్ విపిన్‌కుమార్, స్థానికుడు

వచ్చే నెల 11న మైనార్టీ సంక్షేమ దినోత్సవం

కాకినాడ సిటీ: మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 11న మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖాధికారి ఎం సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం, విభిన్న రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి మౌలానా అబుల్ కలాం అజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1.25 లక్షల ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేస్తారన్నారు. అదే విధంగా డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్ష, సర్టిఫికెట్, జ్ఞాపిక అందించనున్నట్లు వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కోసం దరఖాస్తు చేసేవారు కనీసం ఐదేళ్ల బోధన అనుభవం కలిగి ఉండాలన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేయబడిన దరఖాస్తు ఫారం పూరించి, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు డీఈవో, డిప్యూటీ ఈవో ద్వారా ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు కళాశాల ప్రిన్సిపాల్, డీఈవీ, ఓఆర్ఐఓ ద్వారా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లేదా రిజిస్ట్రార్ ద్వారా ప్రమాణ పత్రాలను జతపర్చి, ఈ నెల 25వ తేదీలోపు పంపించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను డాక్టర్ మహమ్మద్ మస్తాన్, డైరెక్టర్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ, డోర్ నంబర్ 76–1–6ఏ/1, 2, మాలవిక విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానీపురం, విజయవాడ–12 అనే చిరునామాకు స్వయంగా లేదా పోస్టు/కొరియర్ ద్వారా పంపాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో పాల్గొన్న సీఐ పెద్దిరాజు తదితరులు

కాకినాడ రూరల్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సర్పవరం సీఐ బొక్కా పెద్దిరాజు కోరారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో ఆదివారం వాకర్స్ సభ్యులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునిక పరిజ్ఞానం పెరగడంతో, ఆ మేరకు సమాజంలో మోసాలు కూడా అధికమవుతున్నాయని విశదీకరించారు. సెల్‌ఫోన్‌లో అవతలి వ్యక్తి ఎవరో తెలియకుండా మాట్లాడడంతో, తరువాత మోసాలకు గురవుతున్నారన్నారు. బ్యాంక్ ఓటీపీలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, జూదం, బెట్టింగ్, ఆన్‌లైన్ రుణాలు తదితర మోసాలు జరుగుతున్నందున, ఎవరైనా ఫోన్ చేస్తే ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. దొంగతనాలు కూడా అధికంగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలుగైదు రోజులు ఉండేలా ఊరు వెళ్లాల్సి వస్తే పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కొందరు చదువుకుంటున్న యువకులు దురలవాట్లకు లోనవుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం ప్రారంభం

బోట్‌క్లబ్: మృతదేహాలకు దహన సంస్కారాలను కట్టెలతో చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని గ్యాస్ ఆధారిత మొబైల్ శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రోటరీ గవర్నర్ ఎం వేంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న విజ్జపురెడ్డి హిందూ శ్మశాన వాటికకు కోల్ ఇండియా సౌజన్యంతో మొబైల్ గ్యాస్ ఆధారిత క్రిమటోరియంను అందించారు. ఈ సందర్భంగా దానిని ఆయన ప్రారంభించారు. కేవలం అరగంట సమయంలో దహన సంస్కారం పూర్తి చేయవచ్చన్నారు. దీనివల్ల ఎటువంటి పొల్యూషన్ ఉండదన్నారు. అనంతరం శ్మశాన వాటిక సిబ్బందికి రోటరీ టీ షర్టులను అందించారు. కాటికాపరులకు ప్రత్యేకంగా తయారుచేయించిన బూట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ ఆర్వీ సుబ్బారావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు పోలిశెట్టి ఈశ్వరరావు, కల్యాణ్ చక్రవర్తి, కాశీవిశ్వనాథం , బాబి పాల్గొన్నారు.



గ్యాస్ ఆధారిత క్రిమిటోరియాన్ని ప్రారంభిస్తున్న వేంకటేశ్వరరావు

క్రీడాకారులకు రవాణా ఖర్చుల అందజేత



జట్టుకు నగదును అందిస్తున్న జార్జి తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): హిందూపూర్‌లో ఈ నెల 21 నుంచి జరుగుతున్న అండర్–17 వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు రవాణా ఖర్చుల కోసం రూ.14 వేలు అందజేసినట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి ఆదివారం తెలిపారు. ఈ మొత్తాన్ని జట్టు కోచ్, మేనేజర్లకు కాకినాడలోని రోలర్ స్కేటింగ్ రింక్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశామన్నారు. అదేవిధంగా పోటీలలో పాల్గొంటున్న జట్టుకు స్పోర్ట్స్ కిట్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. అంతర్ జిల్లాల పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని జట్టు సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి సునీల్, పీడీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకన్నారావు చౌదరి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్

కరప: మండలం వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్ హోంలో ఆదివారం మెడోఫాం, టెక్సాన్ మందుల కంపెనీల సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ వేళంగి ప్రెసిడెంట్ చుండ్రు వెంకన్నారావు చౌదరి ప్రారంభించారు. వేళంగి పరిసర గ్రామాల నుంచి సుమారు 200 మంది హాజరయ్యారు. ఎండో క్రినోలోజీ డాక్టర్ భీమాల దుర్గాప్రసాద్, ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు, లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, ఇతర వైద్య సిబ్బంది బీపీ, సుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వేళంగి కోశాధికారి ఎం.రాజేంద్ర, కార్యదర్శి ఇళ్ల ఆదేశ్, సభ్యులు బొద్దు భాస్కరరామన్, చుండ్రు శ్రీధర్, పాతూరి శ్రీహరి, ఎం.ప్రసాద్, బొండా చంటిబాబు, కుంచే సుబ్రహ్మణ్యేశ్వరరావు, నున్న సూరిబాబు, సుంకర చంటి తదితరులు పాల్గొన్నారు.

27న లయన్స్ క్లబ్ సంకల్ప్ ట్రెజర్ హంట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈశ్వర్‌కుమార్, బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: ప్రాణాంతక వ్యాధిగ్రస్త చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు లయన్స్ క్లబ్ సంకల్ప్ ట్రెజర్ హంట్ పేరుతో నిధుల సేకరణ కార్యక్రమం కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ, జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు .ఆదివారం ఎస్‌ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ప్రాంగణంలో ఈ నెల 27న నిర్వహించనున్న ట్రెజర్ హంట్ ప్రత్యేక కార్యక్రమ పోస్టర్లను బాదం బాలకృష్ణ, ఈశ్వరుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పౌష్టికాహారం అందజేయడం ద్వారా చిన్నారుల ఆయుర్దాయం, ఆరోగ్యం పెంచేందుకు అవసరమైన నిధులను సేకరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తమని వివరించారు. అందుకోసం క్లబ్ తరపున కృషి చేస్తున్న తీరు ఇతర క్లబ్‌లకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాసు, క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ లక్ష్మీ లావణ్య రీజినల్ చైర్‌పర్సన్ పున్నమరాజు, జోన్ చైర్‌పర్సన్ రాజేశ్వరి, క్లబ్ సెక్రటరీ సువర్చల, ట్రెజరర్ మాలతి, మెట్ట రాథ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ క్యాంపస్‌గా పీఆర్ కళాశాల



కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఆల్ ఈజ్ వెల్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

బోట్‌క్లబ్: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గ్రీన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు కాలేజ్ గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ ముందుకు వచ్చిందని సంఘ సెక్రటరీ తలాటం హరీష్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో 150 వేప మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆల్ ఈజ్ వెల్ సభ్యులు కళాశాల 4 ఎన్ఎస్ఎస్ యూనిట్లకు చెందిన విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో చెత్తను తొలగించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ, ఎంతో కష్టపడి వేప మొక్కలు నాటితే వాకింగ్‌కు వచ్చేవారు వేప చిగుర్లు తెంపి తినడం వల్ల మొక్కలు చనిపోతున్నాయన్నారు. వాకింగ్ వచ్చేవారు మొక్కలను తాకకుండా ఉంటే అవి పెరిగే అవకాశం ఉందన్నారు. వాకర్స్ ఎవ్వరూ మొక్కలు తాకరాదని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ నాయకులు, ఆల్ ఈజ్ వెల్ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గణపతికి లక్ష గరిక పూజ



ప్రత్యేక అలంకరణలో భోగిగణపతి

బోట్‌క్లబ్: సంకష్టహరచతుర్థి రోజున గణపతి ఆశీర్వాదం కోసం భక్తిజ్ఞాన వైరాగ్యంతో ఉపవాస ఆరాధకులు చంద్రుడిని దర్శించుకుంటే సర్వార్థ సిద్ధి పొందుతారని గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. సంకష్ట హర చతుర్థి సందర్భంగా స్వయంభు భోగి గణపతి పీఠంలో ఆదివారం 8వ చతుర్థి మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుప్రభాత వేళలో సింధూర గణపతిని ఊరేగించిన నగర సంకీర్తనలో చతుర్థి ఉపవాసకులు గరిక మోపులు చేపట్టి సన్నాయి మంగళ వాయిద్యాల నడుమ గణపతి నామాలతో శంఖారావం చేశారు. లక్ష గరిక పూజతో సహస్రనామ పారాయణ వైభవంగా నిర్వహించారు. చతుర్థి మాసోత్సవాలు గత మాఘ మాసం నుంచి నగర సంకీర్తనతో జరుగుతున్నాయి. 2026 మాఘమాసం వరకు పీఠంలో చతుర్థి మాసోత్సవాలు ప్రత్యేకంగా జరుగుతాయి.